# బరితెగింపు..!

- అక్రమ నిర్మాణం తొలగించినా తగ్గని అక్రమార్కుడు
- వడ్లపూడిలో రూ.70 లక్షల విలువైన స్థలం ఆక్రమణ
- మళ్లీ దర్జాగా ప్రహరీ నిర్మాణం
- చోద్యం చూస్తున్న అధికారులు



ఆక్రమిత స్థలంలో మళ్లీ నిర్మించిన ప్రహరీ



ఆక్రమిత స్థలంలో ప్రహరీని తొలగిస్తున్న ఉక్కు భూసేకరణ కార్యాలయ సిబ్బంది (ఫైల్)

**గాజువాక:** వడ్లపూడి నిర్వాసిత కాలనీ అప్పికొండలో విలువైన ప్రభుత్వ స్థలాన్ని ఒక వ్యక్తి దర్జాగా కబ్జా చేస్తున్నాడు. సంబంధిత స్థలాన్ని కమర్షియల్‌గా ఉపయోగించుకొనే అవకాశం ఉండడంతో ఎలాగైనా సొంతం చేసుకోవాలని రకరకాల పన్నాగాలతో రంగంలోకి దిగాడు. సుమారు రూ.70లక్షల విలువైన ఈ స్థలం పరిరక్షణ కోసం స్టీల్‌ప్లాంట్ భూసేకరణ అధికారులు గతంలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును సైతం మాయం చేశాడు.

**ఇదీ పరిస్థితి**

వడ్లపూడి పునరావాస కాలనీ సెక్టార్–1లోని అప్పికొండ కాలనీకి చెందిన లే అవుట్‌లో 531 నంబరులో 107 చదరపు గజాల స్థలాన్ని అధికారులు ఎవరికీ కేటాయించలేదు. ఆ స్థలం సెమీ కమర్షియల్ స్వభావాన్ని కలిగి ఉండడంతో దాని విలువ విపరీతంగా పెరిగింది. ఈ పరిస్థితుల్లో అక్కడ ఖాళీగా కనిపిస్తున్న స్థలంపై కన్నేసిన వ్యక్తి దాన్ని ఆక్రమించడానికి అన్ని విధాలా ప్రయత్నాలు ముమ్మరం చేశాడు. గతంలో ఈ స్థలాన్ని చదును చేసి నిర్మాణానికి ఉపక్రమించాడు. దీనిపై స్థానికుల నుంచి ఫిర్యాదులు అందడంతో స్పందించిన అప్పటి స్టీల్‌ప్లాంట్ భూసేకరణ అధికారులు దాని పరిరక్షణకు చర్యలు చేపట్టారు. ఆ స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఆక్రమణకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. దీంతో కొద్దికాలం ఆక్రమణదారుడు ఆ స్థలం జోలికి వెళ్లలేదు.

**మళ్లీ రంగంలోకి..**

అప్పటి అధికారులు మారిపోయారు.దీంతో ఆక్రమణదారుడు మళ్లీ రంగంలోకి దిగాడు. స్థలం చుట్టూ ఇటీవల ప్రహరీ నిర్మించాడు. దీనిపై స్థానికుల నుంచి మళ్లీ ఫిర్యాదు అందినప్పటికీ అధికారులు పెద్దగా స్పందించకపోవడంతో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో స్పందించిన భూసేకరణ అధికారులు ఆ స్థలంలో గోడను తొలగించారు. ఇది జరిగి మూడు వారాలైనప్పటికీ అందులో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయకపోవడంతో ఆక్రమణదారుడు మళ్లీ ప్రహరీని యథావిధిగా ఏర్పాటు చేశాడు. దీనిపై సంబంధిత అధికారులకు మళ్లీ ఫిర్యాదు చేసినా కాలం గడిపేస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు.

**ఉదాసీనత ఎందుకో?**

తమవద్ద సిబ్బంది లేరని ఒకసారి, ఉన్న సిబ్బందికి జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి రకరకాల పనులు అప్పగించారని భూ సేకరణ అధికారులు మరోసారి చెబుతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ చర్యలు ఆక్రమణదారుడికి సహకరించడానికేనని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ హెచ్చరిక బోర్డు తొలగించిన వ్యక్తిపై చర్యలు తీసుకోరా అని ప్రశ్నిస్తున్నారు. ఆక్రమిత స్థలంలో ప్రహరీ తొలగించి పరిరక్షణ చర్యలు చేపట్టాలని, హెచ్చరిక బోర్డు పునరుద్ధరించాలని కోరుతున్నారు.

> **ఆక్రమిత స్థలం స్వాధీనం చేసుకుంటాం**
>
> అప్పికొండ కాలనీ సెక్టార్–1లోని 531 నంబరు గల స్థలాన్ని ఎవరికీ కేటాయించలేదు. ఆ స్థలాన్ని కేటాయించినట్టు ఎవరూ ఉత్తర్వులు చూపించినా చెల్లవు. ఆ ప్రాంతంలో కేటాయింపులు చేయని స్థలాలను సర్వే చేసి పరిరక్షణ చర్యలు చేపడతాం. హెచ్చరిక బోర్డులు కూడా వెంటనే ఏర్పాటు చేస్తాం. ఆక్రమణకు ప్రయత్నిస్తున్నవారిపై కేసులు నమోదు చేస్తాం.
>
> – సునీత,స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, విశాఖ స్టీల్ భూసేకరణ విభాగం

## సమ్మె విరమించుకోండి

- స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం విజ్ఞప్తి



కార్మిక సంఘాలతో సమావేశమైన యాజమాన్య ప్రతినిధులు

**ఉక్కునగరం:** స్టీల్‌ప్లాంట్ కార్మిక సంఘాలు తలపెట్టిన సమ్మెను విరమించుకోవాలని ఉక్కు యాజమాన్యం ప్రతినిధులు కార్మిక సంఘాల నాయకులకు విజ్ఞప్తి చేశారు. ఈనెల 28న సమ్మె చేయనున్నట్టు ఈనెల 14న యాజమాన్యానికి ఎన్డీఏ కూటమి, కూటమేతర కార్మిక సంఘాలు తరఫున సమ్మె నోటీసు అందజేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం స్టీల్‌ప్లాంట్ ఈడీ (వర్క్స్) కాన్ఫరెన్స్ హాలులో సీజీఎం (వర్క్స్) యు. శ్రీధర్, సీజీఎం (హెచ్‌ఆర్) జి. గాంధీలు కార్మిక సంఘాల నాయకులతో సమావేశమయ్యారు. ఈనెల 27న బ్లాస్ట్‌ఫర్నేస్–1 ప్రారంభించనున్నందున సమ్మె విరమించుకొని యాజమాన్యానికి సహకరించాలని కోరారు. దీనిపై కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రతీ నెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని, హెచ్‌ఆర్‌ఏ పునరుద్ధరించాలని, కరెంటు చార్జీలు తగ్గించాలని కోరారు. దీనిపై యాజమాన్య ప్రతినిధులు మాట్లాడుతూ ఉత్పత్తి పెరిగితే అన్ని సమస్యలు పరిష్కారమవుతాయని, యాజమాన్యానికి సహకరించాలని కోరారు. చివరగా కార్మిక నాయకులు మాట్లాడుతూ తాము చర్చించుకుని తమ అభిప్రాయం తెలియజేస్తామని తెలిపారు. సమావేశంలో కూటమేతర కార్మిక సంఘాల నాయకులు డి. ఆదినారాయణ, జె. అయోధ్యరామ్, యు. రామస్వామి, కారు రమణ, ఎస్.ఎ. నాయుడు, డి. అప్పారావు, మహాలక్ష్మి నాయుడు, కూటమి నాయకులు కొమ్మినేని శ్రీనివాస్, నమ్మి సింహాద్రి, కాంద్రేగుల శ్రీనివాసనాయుడు, లక్ష్మణరావు, కోటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

## ఉచిత మెగా వైద్య శిబిరం రేపు



వైద్య శిబిరం కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న వాసవీ క్లబ్ ప్రతినిధులు

**అక్కిరెడ్డిపాలెం:** వాసవీ క్లబ్ అక్కిరెడ్డిపాలెం, నాతయ్యపాలెం ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు క్లబ్ ప్రతినిధులు తెలిపారు. 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం రామాలయం వద్ద గల కల్యాణ మండపంలో నిర్వహించనున్న శిబిరానికి సంబంధించిన కరపత్రాన్ని శుక్రవారం విడుదల చేశారు. మెడికవర్ ఆస్పత్రి, పుష్పగిరి కంటి ఆస్పత్రి వైద్యులు సేవలు అందించనున్నారన్నారు. ఉదయం 9 గంటకు నుంచి ప్రారంభమయ్యే వైద్య శిబిరాన్ని పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు నున్న గాంధీ గుప్తా, కార్యదర్శి జి.కుమార స్వామి, కోశాధికారి నున్న శ్రీరామ్మూర్తి, డీపీవో వి.కుమార గుప్తా, డీవో కటకం శైలజ పాల్గొన్నారు.

## అదనపు చార్జీలు రద్దు చేయాలని ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

**గాజువాక:** ఇంధన సర్దుబాటు చార్జీలు, ట్రూ అప్ చార్జీల పేరుతో విధించిన అదనపు భారాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం గాజువాక నాయకులు ధర్నా నిర్వహించారు. వందడుగుల రోడ్‌లోని చినగంట్యాడ విద్యుత్ సబ్ స్టేషన్‌వద్ద శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆ పార్టీ గాజువాక కార్యదర్శి ఎం.రాంబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలను పెంచడం దారుణమన్నారు. అధిక ధరలతో ప్రజలు ఇబ్బంది పడుతుంటే గోరుచుట్టుపై రోకటి పోటులా ప్రభుత్వ చర్యలు ఉన్నాయన్నారు. అధికారంలోకి వస్తే ధరలు తగ్గిస్తామని చెప్పిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలపై భారాలు మోపుతున్నారన్నారు. క్రూడాయిల్ ధరలు ప్రపంచవ్యాప్తంగా తగ్గుతుంటే బీజేపీ ప్రభుత్వం మాత్రం పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించకపోవడం దుర్మార్గమన్నారు. పెంచిన విద్యుత్ , పెట్రోల్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎన్.రాజేంద్ర ప్రసాద్, కె.సంతోషం, కిరీటం, జి.లక్ష్మి, ఎస్.గణేష్, గొలగాని అప్పారావు, రాజు, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు



ఎస్‌ఐ వరలక్ష్మిని సత్కరిస్తున్న మరిడిమాంబ ఆలయ కమిటీ సభ్యులు

**అగనంపూడి:** నిత్యం రద్దీగా ఉండే అగనంపూడి మరిడిమాంబ కూడలిలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోనున్నామని దువ్వాడ ట్రాఫిక్ ఎస్‌ఐ డి. వరలక్ష్మి అన్నారు. 85వ వార్డు అగనంపూడి నిర్వాసితకాలనీ కొండయ్యవలస గ్రామదేవత మరిడిమాంబ అమ్మవారి ఆలయంలో ఆమె శుక్రవారం పూజలు నిర్వహించారు. అనంతరం ఆమెను స్థానికులు నాయకులు సత్కరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కూడలిలో ఫ్రీ లెఫ్ట్ ఏర్పాటు అంశంఅధికారుల దృష్టిలో ఉందన్నారు. జీవీఎంసీ, ఎన్‌హెచ్‌ఏఐ అధికారుల సహకారంతో సమస్య పరిష్కరించే దిశగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారన్నారు.

## డ్వాక్రా గ్రూపుల్లో చేరాలని ఒత్తిడి చేయడంలో ఆంతర్యమేంటి?



మాట్లాడుతున్న కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకుడు అప్పారావు

**అగనంపూడి:** పారిశుధ్య కార్మికులను డ్వాక్రా గ్రూపుల్లో చేరాలని ఒత్తిడి చేయడంలో ఆంతర్యం ఏంటని జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకుడు గొలగాని అప్పారావు ప్రశ్నించారు. జీవీఎంసీ 85వ వార్డు పరిధిలోని పారిశుధ్య కార్మికులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్ని రోజులుగా ఆర్‌పీలు పారిశుధ్య కార్మికులను పొదుపు సంఘాల్లో చేరాలని ఒత్తిడి తెస్తున్నారన్నారు. జీవీఎంసీ పీడీ ఆదేశాలంటూ కార్యాలయాల వద్ద ఎందుకు హడావుడి చేస్తున్నారని నిలదీశారు. కార్మికుల్లో ఎక్కువ మంది నిరక్షరాస్యులు ఉన్నారని, వారిలో అపోహలు నెలకొన్నాయని వెంటనే నివృత్తి చేస్తే తప్పా చేరేది లేదన్నారు.

## క్లుప్తంగా

### రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన



రొమ్ము కాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న కుశాల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ దివ్య

**అగనంపూడి:** మునగాకు, కరివేపాకుల్లో మెండుగా పోషక విలువలు ఉంటాయని కుశాల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎల్.దివ్య అన్నారు. రొమ్ము క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా వడ్లపూడిలోని అంగన్‌వాడీకేంద్రంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. రుతుక్రమం ఆగిపోయే మహిళలు, గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మునగాకు, కరివేపాకు వల్ల కలిగే ఉపయోగాలు, ఉన్న పోషకాలను ప్రయోగం ద్వారా వివరించారు. మహిళలు ఆరోగ్యసూత్రాలు పాటించకపోవడం, సమయానికి ఆహారం, నిద్ర లేకపోవడం, తీసుకున్న ఆహారంలో పోషకవిలువలు లేకపోవడం వల్ల క్యాన్సర్ బారిన పడుతున్నారన్నారు.

### రక్తదాన శిబిరానికి స్పందన



తుంగ్లాంలో నిర్వహిస్తున్న రక్తదాన శిబిరం

**అక్కిరెడ్డిపాలెం:** ఒకరు రక్తదానం చేయడం వల్ల ఇద్దరి ప్రాణాలు కాపాడినవారవుతారని 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి అన్నారు. తుంగ్లాంలో కాకి కుంచారావు (జస్టిన్) ప్రథమ వర్ధంతిని పురస్కరించుకొని శుక్రవారం జస్టిన్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని కార్పొరేటర్‌తో పాటు వందే భారత్ బ్లడ్ బ్యాంక్ ఎండీ వినోద్ బాబు ప్రారంభించారు. 60 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కొల్లి అప్పల రెడ్డి, కొల్లి కుంచారావు, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

### విరబూసిన బ్రహ్మకమలం



కణితి నిర్వాసితకాలనీలో ఓ ఇంట్లో విరబూసిన బ్రహ్మకమలం

**అగనంపూడి:** బ్రహ్మ కమలాలు విరబూశాయి. 87వ వార్డు కణితి కాళింగ వీధికి చెందిన దుగ్గపు దానప్పలు ఇంటి ఆవరణలో నాటిన బ్రహ్మకమలం మొక్కలకు గులాబి, తెలుపు రంగుల్లో పూలు పూశాయి. అరుదుగా పూలు పూసే చోట శుభం జరుగుతుందని నమ్మకం. దీంతో వీటిని చుట్టుపక్కల వాళ్లు వచ్చి చూసి వెళ్తున్నారు. రాత్రిపూట మాత్రమే ఈ పుష్పం వికసిస్తుంది.

### నేటి నుంచి దయాల్‌బాగ్ ఉత్పత్తుల ప్రదర్శన

**ఆరిలోవ:** దయాల్‌బాగ్ వస్తు ప్రదర్శన ఈ నెల 19 నుంచి 20 వరకు నిర్వహిస్తున్నట్లు డీఈఐ ఎపెక్ హెడ్ వి.ప్రేమ్ స్వరూప్ తెలిపారు. విశాలాక్షినగర్ డీబీసీ కేంద్రంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. డీఈఐ(దయాల్‌బాగ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్) సౌత్‌జోన్ ఆధ్వర్యంలో ఉషోదయ కూడలి వద్ద గల ఉషోదయ ఫంక్షన్ హాలులో ఈ ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు. ప్రతి రోజూ ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రదర్శన ఉంటుందని వెల్లడించారు. బ్లాక్ ప్రింటెడ్ చీరలు, దుప్పట్లు, బెడ్‌షీట్లు, దివాన్ సెట్లు, పిల్లో కవర్లు, జ్యూట్, కాటన్‌తో తయారు చేసిన బ్యాగులు అందుబాటులో ఉంటాయన్నారు.

## చీకటమ్మ... చీకటి

- అంధకారంలో దువ్వాడ రైల్వేస్టేషన్ రహదారి
- అవస్థలు పడుతున్న ప్రయాణికులు, వీఎస్ఈజెడ్ ఉద్యోగులు



దువ్వాడ రైల్వే క్రాసింగ్ వంతెనపై చీకట్లో రాకపోకలు సాగిస్తున్న వాహనాలు

**అగనంపూడి:** దువ్వాడ రైల్వేస్టేషన్ రోడ్డు, క్రాసింగ్ వంతెనపై అంధకారం నెలకొంది. కొన్ని నెలలుగా ఇదే పరిస్థితి ఉన్నా జీవీఎంసీ, రైల్వే, వీఎస్ఈజెడ్ అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ఫలితంగా ప్రయాణికులు, వీఎస్ఈజెడ్ ఉద్యోగులను ఇబ్బందులు పడుతున్నారు. దువ్వాడ వీఎస్ఈజెడ్‌లోని వివిధ కంపెనీల ఉద్యోగులు బీ షిఫ్ట్ ముగించుకొని ఇళ్లకు వెళ్లే సమయంలో, సీ షిఫ్ట్‌కు హాజరయ్యే ఉద్యోగులతోపాటు వేలాది మంది ప్రయాణికులు రాత్రి వేళల్లో ప్రయాణం చేయడానికి భయాందోళన చెందుతున్నారు. అలాగే సబ్బవరం మండలంలోని వెదుళ్లనరవ, నంగినారపాడు, గంగవరం, అజనగిరి గ్రామాలతోపాటు పరిసర గ్రామాలకు చెందిన వారు ఈ మార్గంలో నిత్యం ప్రయాణం చేస్తున్నారు. వీధి దీపాలు కొన్ని నెలల కిందట మరమ్మతులకు గురయ్యాయి.వాటి స్థానంలో కొత్తవి అమర్చాల్సి ఉన్నా పట్టించుకోపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదని ప్రయాణికులు ఆవేదన చెందుతున్నారు. మూడు విభాగాల అధికారులు సమన్వయంతో వ్యవహరించి వెంటనే వీధి లైట్లు అమర్చాలని కోరుతున్నారు.

## నీటి సరఫరా బంద్ నేడు

**అగనంపూడి:** జీవీఎంసీ 87వ వార్డు పరిధి సిద్ధార్థ నగర్‌లోని 12 ఎంఎల్‌డీ నీటి శుద్ధి కర్మాగారం పరిధిలో మరమ్మతుల కారణంగా 86, 87 వార్డుల పరిధిలోని ప్రాంతాలకు శనివారం నీటిసరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ కేదరీనాథ్ తెలిపారు. వాల్వ్‌లు మార్చడం, మరమ్మతులు చేపట్టనున్న కారణంగా శనివారం నీటిసరఫరా ఉండదని పేర్కొన్నారు. ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

## మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ



కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

**పెదగంట్యాడ:** మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకుంటే వారి కుటుంబాలకు ఆసరాగా నిలబడతారని రోటరీ క్లబ్ అధ్యక్షుడు సిరట్ల శ్రీనివాసు (వాసు) అన్నారు. స్థానిక సమతానగర్‌లోని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఇటీవల పలువురు మహిళలకు కుట్టు శిక్షణ ఇచ్చారు. 14 రోజుల పాటు నిర్వహించిన ఈ శిక్షణ శుక్రవారంతో పూర్తయింది. శిక్షణ పొందిన మహిళలకు 10 ఎంబ్రాయిడరీ కుట్టు మిషన్లు అందజేశారు. కార్యక్రమంలో రోటరీ గవర్నర్ డాక్టర్ వెంకటేశ్వరరావు, వి. సుబ్బారావు, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ట్రాన్స్‌జెండర్ల ఉపాధికి భరోసా కల్పిద్దాం

**మద్దిలపాలెం:** ట్రాన్స్‌జెండర్లకు స్వయం ఉపాధి కల్పించడంలో దేశంలోనే విశాఖ ఆదర్శంగా నిలిచేలా కృషి చేద్దామని నగర పోలీస్ కమిషనర్ శంఖబత్ర బాగ్చి పిలుపునిచ్చారు. కోల్ ఇండియా సీఎస్సార్ నిధులు రూ.2.50 కోట్లతో ఆధునిక కుట్టు మిషన్లను మహిళలు, ట్రాన్స్‌జెండర్లకు అందించడం అభినందనీయమన్నారు. పిఠాపురంకాలనీలోని జన శిక్షణ సంస్థాన్‌లో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో సీపీ పాల్గొని.. 75 మందికి ఆధునిక కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ఈ కుట్టు మిషన్లను ప్రతి మహిళా, ట్రాన్స్‌జెండర్లు సద్వినియోగం చేసుకుని.. ఆర్థిక స్వావలంబన సాధించాలన్నారు. మహిళలు కుట్టిన వస్త్రాలకు మార్కెటింగ్ సదుపాయం కల్పించాలని, ఇందుకు స్వచ్ఛంద సంస్థలు సహకరించాలన్నారు. విశాఖలో ట్రాన్స్‌జెండర్లకు సరైన ఉపాధి అవకాశాలు లేక ఇతర మార్గాల్లో పయనిస్తున్నారని.. దీని ద్వారా ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. నగరంలోని ట్రాన్స్‌జెండర్లను గుర్తించి.. వారందరికీ ఉపాధి కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

## అమ్మో ఆటోనగర్



ప్రమాదకరమైన గోతులరోడ్డుపై వాహనదారుల ఫీట్లు



రోడ్డు ఇలా... రాకపోకలెలా..

**అక్కిరెడ్డిపాలెం:** పారిశ్రామిక ప్రాంతం ఆటోనగర్ పేరు చెబితే వాహనదారులు హడలిపోతున్నారు. గోతుల వల్ల వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికే ద్విచక్రవాహనం వెనుక కూర్చొన్న మహిళ గోతుల వల్ల తూలి పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. మరో వాహనదారుడు గోతిలో పడి తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆటోనగర్ ఆర్చ్ నుంచి డోజీకో కంపెనీ వరకు బి - బ్లాక్ పరిస్థితి మరింత అధ్వానంగా ఉంది. కాగా సమస్యను ఏపీ ఎంఎస్ఎంఈ చైర్మన్ టి.శివ శంకర్ దృష్టికి ఐలా చైర్మన్ కె.సత్యనారాయణ రెడ్డి (రఘు) తీసుకెళ్లారు. అంతా స్పందించి బి- బ్లాక్ రోడ్డు వేయడంతో పాటు మిగిలిన ప్రాంతాల్లో మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.



ఆటోనగర్ బి - బ్లాక్‌లో గోతులు తేలిన రోడ్డు



గొయ్యి.. అదుపు తప్పితే అంతే మరి..

## విశాఖ వ్యాలీ స్కూల్ ప్రిన్సిపాల్‌కు అవార్డు



అవార్డు స్వీకరిస్తున్న ఈశ్వరీ ప్రభాకర్

**ఆరిలోవ:** విశాఖ వ్యాలీ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వరీ ప్రభాకర్‌కు ప్రతిష్టాత్మకమైన ఎడ్యుకేషన్ వరల్డ్ ఇండియా స్కూల్ గ్రాండ్ జ్యూరీ అవార్డు 2024–25 వరించింది. న్యూఢిల్లీలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆమె ఈ అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె 'సాక్షి'తో ఫోన్‌లో మాట్లాడారు. డిజైన్ థింకింగ్ లీడర్‌గా ర్యాంక్ పొందినట్లు తెలిపారు. రోట్ లెర్నింగ్‌కు మించి ముందుకు సాగడం, విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆలోచన, సహకారం, సమస్య పరిష్కారం తదితర నైపుణ్యాలను పెంపొందించే బోధన విధానాన్ని అమలు చేయడంలో అసాధారణమైన సామర్థ్యాన్ని గుర్తించి ఈ అవార్డుకు తనను ఎంపిక చేసినట్లు వివరించారు. ఈ విభాగంలో దేశంలో టాప్ 10లో నిలిచినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన ర్యాంకింగ్‌లో విశాఖపట్నం జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో మొదటి స్థానంలో నిలవడంతో ఈ అవార్డు వరించిందన్నారు. కో–ఎడ్యుకేషన్ పాఠశాలల్లో విశాఖ వ్యాలీ స్కూల్ రాష్ట్రంలో టాప్–3లో నిలిచినట్లు వెల్లడించారు. ఈ అవార్డు రావడంపై సంతోషం వ్యక్తం చేశారు.

## దేశ భవిష్యత్తును మార్చేది ఓటు



ఓటు హక్కు ప్రాధాన్యతను వివరిస్తున్న గాజువాక తహసీల్దార్ శ్రీవల్లి

**అగనంపూడి:** ఓటు హక్కు దేశ గమ్యాన్ని, భవిష్యత్తును మార్చుతుందని గాజువాక తహసీల్దార్ శ్రీవల్లి అన్నారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో ఓటు విలువ, ప్రజాస్వామ్యంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటుకు ఉన్న విలువ, ప్రాధాన్యతను తెలుసుకోవాలన్నారు. విద్యార్థులు ఈ దశలోనే ఓటు హక్కు విలువ తెలుసోవడం ద్వారా సమాజం, ప్రభుత్వం పనితీరు, నడవడికపై అవగాహన కలుగుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు మాట్లాడుతూ యువత ఓటు హక్కును చక్కగా వినియోగించుకుంటే దేశ స్థితిగతులను మార్చవచ్చన్నారు. ప్రజాస్వామ్యానికి ఆయువుపట్టు ఓటు అన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో పి.సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.